
# చావు విందు

— తుమ్మేటి రఘోత్తమరెడ్డి

కర్మకాండ పూర్తయ్యేసరికే మిట మిట మధ్యాహ్నం అయింది. ఆ తరువాత వచ్చిన బంధువర్గమంతా ఇంటికి చేరారు. నిజానికి చాలా తక్కువ మందే వచ్చారు. వచ్చిన వాళ్ల లోనూ చాలామంది- ఆదరాబాదరాగా భోజనాలు అయ్యాయనిపించుకొని మరి చూడకుండా వెళ్లిపోయారు. చాలా ముఖ్యులైన అతి తక్కువ మందే ఇంకా మిగిలారు.

ఇక గ్రామం లోంచి కూడా చాలా తక్కువ మందే వచ్చారు. ఇప్పుడే కాదు. శవ దహనప్పుడు అంతే... వాళ్లైనా ముగ్గురునలుగురు పెద్ద పెద్ద ఆసాములూ, పెద్ద రైతులే- మునుపటిరోజుల్లో లాగా గ్రామంలోని 'చిల్లర కులాల' వాళ్ళు అసలు అటు తొంగి చూడలేదు.

వెనుకటి దినాలల్లో ఈ ఇంట్లో చావులు కూడా



పెళ్లిళ్లలాగా ఆర్భాటంగా జరిగేవి. నరసింహారెడ్డి, తాత, తండ్రి, తల్లి పోయిన సందర్భాలలోనైతే ఆ పట్టికి పట్టే జనం వచ్చారు. ఆ చావులకు వచ్చిన 'యాట' (మేకలు)లతోనే నరసింహారెడ్డి గొర్ల మందలో మరో 'కట్టె' గొర్లు పెరిగినయ్. చావులకు వచ్చిన బంధువర్గం, పనీ పాటల వాళ్ల కోలాహలంలో ఆ బంగాళా పదిహేను ఇరవై రోజుల దాకా సందడిగా వుండేది.

ఇప్పుడో! బంధువర్గమే కాదు, పనీ పాటల వాళ్లు కూడా నలుగురు ముగ్గురు తప్ప చాలా మంది 'అటు వైపే' పోయారు. ఎంతో నమ్మకంగా, విశ్వా సంగా మెదిలినట్లు కన్పించిన పాలేర్లు కూడా ఆ మందలోనే కలిశారు.' ఇటు తచ్చాడే ఈ నలుగురు ముగ్గురు కూడా ఈసారికి చూసి పూర్తిగా నమ్మకం చిక్కితే ఆ గుంపులోనే కలిసేలాగున్నారు. మసాలా వంటల వాసనతో, అరుపులు, కేకలు, హడావుడిగా వుండాల్సిన బంగళా నిశబ్దంగానే వున్నది.

బంగళా ముందు బాదాం చెట్ల కింద నలుగు రైదుగురు ముసలి బంధువులు మాత్రం మంచాల్లో ఒరిగి గొనుగుతున్నట్లుగా మాట్లాడుతున్నారు. అదే నీడకు మూడు స్కూటర్లు, రెండు బుల్లెట్ సైకిల్ మోటార్లున్నాయి. అదే నీడకు నిలిపి వుంచిన జీపులో డ్రైవరు కునికిపాట్లు పడుతున్నాడు. నర్సింహారెడ్డి కొడుకూ, ఆ మండలానికి మండలాధ్యక్షుడైన మధు కర్ రెడ్డి గన్‌మెన్ ఇంటి పరిసరాలను పరిశీలిస్తూ జీబు ముందు నిల్చున్నాడు.

అది జూన్ నెల మొదటి వారం. పగటి ఎండ తీవ్రతకు తోడు, వర్షాకాలపు ఆరంభానికి సూచనగా గాలి దుమారాలు, ఆకాశంలో అక్కడక్కడ పరు గులెత్తే మబ్బులు. ఎండా, వాన కాలాల సంగమ కాలం కనుక కుమ్ములో పెట్టినట్టుగా ఉబ్బరిస్తోంది. బంగాళా ప్రవేశ ద్వారానికానుకొని వున్న 'కచ్చే రింట్లో' బ్రాహ్మలు, అయ్యవార్లూ ఆ వేడికి తట్టు కోలేక పైనున్న పంచెలతో విసురుకుంటున్నారు. తిరుగని పాతకాలపు ఫ్యానొకటి పై కప్పుకు వచ్చిన గద్దలాగా వేలాడుతోంది. ఒకరిద్దరు ముసలి బ్రాహ్మలు మరణించిన దొర్సాని గుణగణాలు కీర్తించుకుంటు న్నారు. ఎక్కడ పోయారో గాని నిజానికి ఆ బ్రాహ్మలూ, అయ్యవార్లూ కూడా చాలా తక్కువ మందే వచ్చారు. 'ఇటువంటివిపత్కర పరి స్థితుల్లో దొర్సాని కాలధర్మం చేయకపోతే బాగుండి పోవునని' అందులో కొందరు వాపోతున్నారు.!

నర్సింహారెడ్డి తల్లి చనిపోయినప్పుడు ఏమి సందడి? ఆ పన్నెండు రోజులు బ్రాహ్మలూ, అయ్య వార్లూ ప్రతి రోజూ వంటా వార్పూ- వడ్డింపూ చూసేవారు. ఫలహారాలు, పంచభక్ష్యపరమాన్నాలూ - రోమాలు నిక్కబొడిచే లాగున నరకలోకం గురించి పురాణం చెప్పే జగన్నాథాచార్యులు- గజ గజ వణికిపోతూ పాప కర్మల పట్ల భీతిల్లిపోతూ ఆ పురాణాన్ని శ్రద్ధగా ఆలకించే గ్రామీణులూ!'అప్పటికీ, ఇప్పటికీ కాలం ఎంత మారిపోయింది'' అంటూ కొందరు చప్పరించేస్తు న్నారు.



నరసింహారెడ్డి ఇల్లరికం వచ్చిన పెద్దల్లుడు లింగారెడ్డి అదే కచ్చేరింట్లో బ్రాహ్మలకు సంభావనలు ఇవ్వడం ప్రారంభించి దాదాపు పూర్తి కానిచ్చాడు. చెంబులూ, పంచెలూ, నగదు అన్నీ పంచాడు. ముఖ్య బ్రాహ్మడికి ఏవో రెండు బక్క ఆవులను గోదానంగా చదివించాడు. అందాక యథావిధిగా దానాలు అడుగుతూ- పడుతూ వున్న బ్రాహ్మడి గొంతు భూదానం దగ్గరికి వచ్చే సరికి పట్టేసింది. నలభై సంవత్సరాలుగా ఆ చుట్టుపక్కల గ్రామాల్లో పౌరోహిత్యం చేస్తూ, పెద్ద పెద్ద దొరల ఇండ్లల్లోని చావుల సందర్భంగా అతనెంతో సంతోషంగా భూదానాలు అడిగాడు, పట్టాడు. కాని ఇలాంటి పరిస్థితులు వస్తాయని ఏనాడూ ఊహించని ఆ బ్రాహ్మడు కాసేపు తటపటా యించి వృత్తిధర్మంగా గొంతు పెగుల్చుకొని 'దొరవారూ భూదానం'' అన్నాడు.


ఆ మాటతో లింగారెడ్డి ఏమనాలో తోచక కూర్చుండి పోయాడు. భూమి చుట్టూఅల్లుక పోయిన అతని ముప్పయేండ్ల ఇల్లరికపు జీవితం గిర్రున కళ్ళల్లో మెదిలింది. కూటికి గతిలేని పేద రైతు కుటుంబం. ఇల్లరికపు అవమానాలు..అంతకన్న ఈ బంగళా గోడల్లో ఇమడలేక వచ్చిన నెలకే పారిపోయాడు. తన బంధువులు తల్లీ, తండ్రీ, ఇల్లరికపు అల్లుని కుండాల్సిన ఓపిక గురించి నచ్చ చెప్పతూ 'మన తాతల కాన్నుండి దున్నుకోను భూమి లేక పడరాని పాట్లు పడ్డాం. నువ్వు కష్ట నిష్ఠూరాల పాలైనా వందెలెకరాల భూమితోటి నీ పిల్ల పిల్లతరాలు సుకపడుతారు'' అని నచ్చ చెప్పడం ఏ శక్తో తన సకల శక్తులు హరించినట్లు తల వంచుకొని తిరిగి అదే గడప తొక్కడం- అప్పటి నుండి తను ఏ గొడవకు ఖేద పడలేదు. కనుచూపు మేర దాకా పరుచుకున్న విస్తారమైన పంట భూములు తనను కట్టి పడేశాయి. ఎన్నో అవమానాలను రేపు పంచుకోబోయే భూమి కోసం దిగమింగాడు. కాని చివరకు...

లింగారెడ్డి తనకు తెలియకుండానే ఒక గాఢమైన నిట్టూర్పు విడిచి లేచి మామగారిని సంప్రదించడం కోసం బంగళాలోంచి భవంతిలోకి నడిచెడు. ఎక్కడో ఏదో చిక్కు పడుతోంది. ముందు జరగబోయేదేమిటో ఎన్నిరకాల ఆలోచించినా అంతుపట్టడం లేదు.

భవంతిలో గల నల్లగా మాగిన మొగురాలు కొత్తగా చూస్తున్నట్టుగా చూసి అక్కడి నుండి కదిలి వెనుకనే గల వంటిల్లు దాటిండు. వంటిల్లు వెనుక పెద్ద పెద్ద రాతి కసీలతో వేసిన సన్న మల్లె పందిరి కింద తట్టు కుర్చీలో ముద్ద కట్టుకపోయి కూర్చున్నాడు నర్సింహారెడ్డి.

మామగారు నిద్రపోతున్నాడో? విచారంతో కళ్ళు మూసుకున్నాడో లింగారెడ్డికి తెలియలేదు.

కుడివేపు పందిరి కింద పెద్ద పెద్ద రాతి పొయ్యిల మీద ఇంకా వంటలు సాగుతూనే వున్నాయి. ఎక్కువ



మంది పని వాళ్ళు లేనందున వంట మనిషికి తోడుగా ఆ ఇంటి ఒక్కగానొక్క కోడలు విమల నానా హైరానా పడుతోంది. లింగారెడ్డి భార్య విధిలేక కోడలితో పాటుగా ఇంటి పనులు చేస్తోంది. నర్సింహారెడ్డి అక్క ఒక ముసలమ్మ. అందునా చెవిటిది; ఆమె కూడా సహాయ పడుతోంది. ఇంటి ఆడబిడ్డలు కొందరు అదే పందిరి కింద చాపలపై పడుకున్నారు. అందరికన్న చిన్నామె తన బిడ్డలను సగబెట్టుకోవడంలో అటు యిటూ తిరుగుతోంది. చాపలల్లో పడుకున్న వాళ్లల్లో పెద్దాడబిడ్డ పెండ్లికెదిగిన బిడ్డకు తల్లి నగల మీద ఆశ పెట్టుకొని తల్లి పెట్టుకున్న నగల వివరాలు గుర్తుకు తెచ్చుకుంటున్నది. ఈ గడబిడలో ఇంటి కోడలుఎక్కడ దాచేస్తుందేమోనని నడిపి ఆడబిడ్డ విమల మీద ఒక కన్నేసి వుంచింది. మరదలు చావు గురించి ఎదురుసరిగా చెప్పనందున ముసలమ్మ మూతి ముందుకు చాపి విమలను సతాయిస్తోంది.

తప్పదు కనుక విమల గొంతు పెంచి ''అమ్మా ఆ రోజు గిదేయాళ్ల- ఎండ నిప్పులు కుమ్మరిస్తంది. మామయ్యా, ఆయన ఇంట్ల లేరు, యల్లపాడుగాను, దొరుసుకపోయినట్టు ఇద్దరు హన్మకొండకే పోయిండ్లు. అత్తమ్మా, నేనూ, వదినమ్మ కలిసి ముగ్గురం భోజనాలు కానిచ్చినం. లింగ రెడ్డన్నయ్య నారుమళ్లకు ఎరువు చల్లిస్తనని అంతకు ముందే పోయిండ్లు. నేను వంటిల్లు సర్దిస్తూ లోపల కాలిపోయిన.'' ఏదో సామాను కోసం విమలను వంటవాళ్లు పిలిచారు.

చెవుటి ముసలమ్మ దొర్సాని దర్పంతో విసుక్కోబోయి ఎందుచేతనో నోరు మూసుకున్నది.

''ఇది ఎటు మలుపు తిరుగుతుంది?'' లింగారెడ్డి మల్లె పందిరి కింద తన్ను తాను మరచిపోయి నిల్చున్నాడు.

విమల మళ్ళీ వచ్చి ముసలమ్మ పక్క కూలబడి ''కుంటి పోషిగాడు లేడూ! వాడే - ఆ పొరకుల కావల ఊరు కాలుతున్నట్టు మొత్తు కోవట్టిండు. నేను చేతులు కొంగుకు తుడుసుకుంటవచ్చిన. అప్పటికే అత్తమ్మ, వదిన వచ్చిండ్లు. వాడు 'పొరకులు' దొబ్బుకొని ఉరికచ్చిండు. అత్తమ్మ ఏదో అంటనే ఉన్నది... వాడు మొసపోసుకుంట లడలడ ఏందో వదిరిండు.'సరిగా చెప్పర గాడ్డి కొడుక'అంట అత్తమ్మ గద్దరాయించింది. వాడు 'దొర్సాని- జెంఢాలు - జెంఢలన బట్టిండు... ఆఖరుకు చెప్పిండాడు ''దొర్సాని పెరట్ల జెంఢాలు పాతుతున్నరని.

''ఎవ్వరా జెంఢాలు పాతేది- పోచంపాడు కాలువలోల్లు గిట్టనా?'' అన్నదత్తమ్మ.

''కాదు బాంచెన్ ఎర్ర జెంఢాలు, ఎర్ర జెంఢాలు ఊళ్లె మాదిగి మన్నెలు సబ్బండవర్ణాలు బాంచెన్ జెర్రికి సీమలు తగిలినట్టు బాంచెన్'' అంట వాడు చెప్పతున్నడు.

''నువ్వేమి అనలేదుర కుక్కల కొడుకా? ఏడ సచ్చిండ్లురా పాలేరోల్లు- ఉరుకురపోషిగా- అందరిని తీసుకురాపో'' అనుకుంట ఇంటెనుక పెరట్ల కెళ్లి ఇగోగిట్లనే ఉరుకబట్టింది. అసలే మనిషి భారీ మనిషాయె. అందట్ల కోపం, ఆదుర్ద ఇగట్ల ఉరుకుబట్టింది. నాకు సంగతి అర్థమై ''అద్దత్తమ్మ మీరెల్లకుండ్లి- మామయ్య వచ్చినంక చూసుకుంటరు'' అనుకుంట నేను నాలుగడుగులేసిన్నో లేదో- అత్తమ్మ అగో ఆ గొడ్ల పడారి గోడకు బొయ్యే నడమ రాయి దట్టుకొని ముల్లె కట్టతీర్గ పడ్డది. ఎంత ఏనైపాయెననుకుంట నేను వదినమ్మ ఉరికేసరికే ''చాతి నొత్తందే పిల్లా'' అన్నది. అదే ఆఖరు మాట. వదినమ్మ నేను అత్తమ్మను ఇంట్లకు ఎత్తుకొచ్చినం. పోషిగాన్ని డాక్టరు కోసం గెదిమినమ్, పెయ్యంత చెమటలు దిగపోసినయ్. అయిదు పది నిమిషాలల్లనే గర్రుమన్నది'' విమల గొంతు కొద్దిగా వనికింది.

చాపల మీద పడుకున్న ఆడబిడ్డలు ''నిన్ను కండ్లారా చూసుకోపోతిమి అమ్మా! మాకేమి చెప్పి పోతివే అమ్మా!'' అంటూ చిన్నగా రాగాలు తీశారు.

పనిలో వున్న లింగారెడ్డి భార్య గుబగుబ కళ్లల్లోకి నీళ్లొచ్చి అట్లాగే నిలబడిపోయింది. ముసలామె కళ్ళు తుడుచుకున్నది. చిన్న బిడ్డకు తినిపిస్తున్న చిన్న బిడ్డ 'అమ్మో అమ్మ'' అంటూ వెక్కి వెక్కి ఏడింది.

నర్సింహారెడ్డి కండ్లు మూసుకునే కోడలు చెప్పేదంతా విన్నాడు. మూసుకున్న అతని కండ్లల్లో రెప రెపలాడుతూన్న ఎర్ర జెండాలు మెదిలినయ్. భార్య మెదిలింది. దుఃఖమో, కోపమో, లేక ఈ రెంటి చేతనో గాని నర్సింహారెడ్డి ఈ పదకొండు రోజులుగా సరిగా నిదురపోలేదు. తను సుదీర్ఘ కాలంలో ఎన్నో ఎన్నెన్నో చావులు, గొడవలు చూశాడు, అనుభవించాడు. కాని ఇంతలా కలత చెందలేదేనాడు.

నర్సింహారెడ్డి కళ్ళు మండుతున్నాయి. అంతకన్నా అంతరంగం భగ భగ మండుతోంది. పదే పదే

కనిపించే ఎర్ర జెండాలను భరించలేక కళ్లు తెరిచాడు. ఎదురుగా తెరిచి వుంచిన పాకుల్లోంచి- ఎడమవైపున ప్రహరి గోడ లోపలున్న పశువుల కొట్టాలు ఎండలో వాటికవే కాలుతు న్నట్లుగా వున్నాయి.. పశువుల కొట్టాలల్లో ఎడ్లూ, గొడ్లూ, బర్లు, దున్నపోతులూ అన్నీ గడ్డి వాముల మీదనే మేస్తూ కనిపించాయి. గత పదిహేను రోజులుగా ఆ కొట్టాలల్లో కసువూడ్చి పేడ కళ్ళు ఎత్తివేసిన నాథుడు లేదు. హౌజుల్లో నీళ్ళు తాగి చెట్ల కింద పడుకుంటున్నాయి.

కుడివేపున కనుచూపు మేరలో విశాలమైన మామిడి తోట, దానికావల నల్లరేగడి భూములు - వాటి నానుకొని వున్న గుట్ట బోరు మీద తన భూమిలో ఎర్ర జెండాలు ఎగురుతూ కనిపించినయ్.

అందాక ఎటూ తోచక నిలబడి వున్న లంగారెడ్డి మామగారు కళ్లు తెరవడం చూసి "మామయ్యా బ్రాహ్మడు భూదానం అడుగుతున్నడు" అని చెప్పాడు.

ఆ మాట విన్న నర్సింహారెడ్డి ముఖంలో విషాదకరమైన నవ్వు రేఖా మాత్రంగా మెరిసి మాయమయ్యింది.

"భూదానమా? బ్రాహ్మడు ఈ రోజు తనతో పరాచికమాడుతున్నడా?" మనసులోనే అనుకున్నాడు.

నర్సింహారెడ్డి దూరంగా తన భూముల్లో కనిపించే ఎర్ర జెండాలు చూడలేక కళ్లు మూసుకున్నాడు.

"ఏది చెప్పమంటరు?" లింగారెడ్డి మళ్లీ అడిగాడు.

"మీరే ఏదో ఒక దిక్కు గుంటో రెండు గుంటలో చెప్పండ్లి బావా!" ఈసారి నర్సింహారెడ్డి రెండవ కూతురు కలుగజేసుకున్నది.

"పెసరుపప్పు ముద్దగారెలు మూకుట్లో గోలిస్తున్న విమల తల తిప్పి చూసి తన పనిలో మునిగిపోయింది.

"ఈ సమయంలో బాపును ఎందుకు ఇబ్బంది పెడుతరు" రెండో కూతురు గాఢంగా నిట్టూర్చి "వాళ్లు అడిగేటట్టున్నది మనం దానంచేసేటట్టు న్నది!" అంది.

కూతురు పెండ్లికి పెద్ద మొత్తమే వసూలు చేయాలనుకున్న నర్సింహారెడ్డి పెద్ద బిడ్డ కూడా ఏదో మాట్లాడాలనుకున్నది. కానీ ఆమెకు ఏ మాట తోచడం లేదు.

లింగారెడ్డి మౌనంగా కచ్చీరింట్లోకి నడిచాడు.

ముసలాయనకు లింగారెడ్డి కాళ్ల చప్పుడు దూరమవడం విన్పించింది. బిడ్డల మాటలు అంతరార్థం తెలుస్తూనే వున్నది. ఇందరి ఆశలు అల్లుకున్న తన జమీ మళ్లీ కళ్లు మూసుకున్నా అదే దృశ్యం కనిపిస్తోంది. ఆయనకు గడిచిన పదకొండురోజులు కంటికి కునుకు లేదు. అతనికి పగలూ రాత్రీ తెలియడం లేదు. వెలుగూ చీకటీ అలుక్కుపోయినట్టుగా వున్నది. పెయ్యంత కారం



## చిట్కాలు

అరకప్పు నిమ్మరసం, అరకప్పు కాకరకాయ రసం, ఒక చెంచా తేనె కలిపి తాగితే 'సైనసైటిస్' తగ్గిపోతుంది. - ఎ.ఎస్.ఎస్.

రాసుకున్నట్లు మండుతోంది. కోపం బుసబుస పొంగుతోంది. ఈ జమీను కోసం... తన పడిన గొడవలు సామాన్యమైనవేమీ కాదు. గ్రామంలో అన్ని రకాల మంచి భూములు పెట్టుకొని ఒక్కడు బతకడం సామాన్యమైన విషయమేమి కాదు. ఆకలిగొన్న కుక్కల్లా రైతులు, మన్నేలు తన జమీను కేసి చూడడం తనకు తెలియంది కాదు. ఒక్కొక్కడు అనేక మార్లు తనతో గొడవపడడం, తను నయానా బయానా గెలుచుకురాగలిగాడు. కాని ఇప్పుడు వాళ్ల వెనుక వున్న వాళ్ళు సామన్యులు కాదు. ఊళ్లె వాళ్ల కూడా...

నర్సింహారెడ్డికి జరిగింది పీడకలో నిజమో ఇంకా తెలియనంత దిగ్భ్రమలో పడిపోయాడు. మనిషి గడ్డ కట్టుకపోయాడు. ఈ కట్టు ఎక్కడ తెగిపోయిందో ముసలాయనకు తెలియడం లేదు.

మళ్లీ ముసలాయనను వెనుకటి సంగతులు ముట్టు ముట్టాయి. "నిన్న మొన్నటి దాకా మంచికీ చెడ్డకూ తన చుట్టే తిరిగినట్టు తిరిగిన జనం, తన అడుగులకు మడుగులొత్తిన జనం- తానేదీ చెప్పినా 'గదే బాంచెన్' అనేటోళ్లు. ఇంతకాలం తన ఉప్పు తిని బతికినవాళ్లు,

ఇవాళ తన భూముల్లో" ముసలాయన తల అడ్డంగా తిప్పాడు.

కొడిశె కట్టెలతో భగ భగ మండుతున్న పొయ్యి మీద మేక తొంట్ల మాంసం తుక తుక ఉడుకుతోంది. వార్చి గిన్నెల్లో తోడిన అన్నం పొగలు సెగలుకక్కుతోంది. మరొక పొయ్యి మీద గోధుమ పూరీలు గోలుతున్నవి. వంట మల్లయ్య మూడు పొయ్యిల చుట్టూ దిగ చెమటలు కారుతుండగా తిరుగుతున్నాడు. విమల కూడా చురుకుగా పనులు నిర్వహిస్తోంది.

"నిజానికి అట్లా అవుతుందని ఒకనాడూ తను అనుకోలేదు" ముసలాయన తట్టు కుర్చీలో కొద్దిగా కదిలి మరింత జారగిలపడిపోయాడు.

"ఇంత పెద్ద ప్రభుత్వము, కచ్చేర్లు, ఠానాలు దండుగేనా

పోలీసులు మిల్ట్రీ పట్టేదేనా? వరంగల్ సభలో భూముల గురించి మాట్లాడినారని పోయి వచ్చిన కొడుకు చెబితే- భూముల గురించి మాట్లాడని పార్టీ ఏదని తాను కొట్టిపారేశాడు. కాని అది నిజమౌతుందని, తన భూముల మీదికే వస్తుందని అనుకోలేకపోయాడు" ముసలాయన విరక్తిగా నిట్టూర్చాడు.

"నలభై ఏండ్ల కింద ఊళ్లకు ఊళ్ల భూములన్నీ అమ్ముక పోయిన దేశ్‌ముఖ్ అన్నారెడ్డి ముసలాయనకు జ్ఞాపకం వచ్చాడు. అప్పుడు ముసలాయన వయస్సు ఇరువై ఏండ్లకు తక్కువే. ముసలాయన తండ్రి నాలుగు అక్షరాలు నేర్చుకొని కరంపు వతన్‌దారు కింద రాతకోతల పని చేశాడు. అప్పటికి నల్గొండ వేపు ముంచుకొచ్చిన కమ్యూనిస్టు, రజాకారు గొడవలు, నైజాం గద్దె దిగి పోవడము, పోలీస్ యాక్షన్- ఆ తరువాత అన్నారెడ్డి ఖద్దరు లాల్చీ, ధోవతి ధరించి వచ్చి ఎటూ ముడామెడ దూరం తన భూములు విస్తరించి వున్న గ్రామాల్లోని పెద్ద పెద్ద రైతులందరిని గడీలోకి పిలిపించుకున్నాడు. మెత్తగానే తన భూములు అమ్మచెప్పాడు. ఆనాటి అన్నారెడ్డి రూపం ముసలాయన ఎన్నడూ మరచిపోలేడు. అప్పుడు తను సవారి బండిలో తండ్రి వెంట దేశ్‌ముఖ్ అన్నారెడ్డి గడికి వచ్చాడు.

అది ఆరంభం. తన తండ్రి పట్వారిగిరి చేస్తున్న గ్రామంలో మంచి విలువైన భూములు, రేగడి భూములు, చందురు పొలాలు, గడ్డికంచెలు నామమాత్రపు ధరలకే ఖరీదు చేశారు. అప్పటికే వున్న భూమికి తోడు రెండు వందల ఎకరాల దేశ్‌ముఖ్ భూమి కూడా తమకు దక్కింది. అప్పటి నుండి గ్రామంలోనిమంచి భూములన్నీ తమ భూముల్లో కలుస్తూనే వున్నాయి. ఇంటి వెనుక నుండి ప్రారంభమైన తమ భూమి చివరకు ఎడమ వేపున గల గుట్ట బోరుతో కలిసి ఏటి ఒడ్డంటా ఆక్రమించాయి.

ముసలాయన అనుచుకోలేని ఉద్వేగంతో కళ్లు తెరిచి తట్టు కుర్చీ కిర కిరలాడుతుండగా లేచి నిలుచున్నాడు. పొయ్యిల మీద ఉడికే వంటలు- ఇంట్లో జరుగుతున్న తతంగం మీద అతనికి ధ్యాసే లేదు. కలలో నడుస్తున్నట్లుగా కొంత దూరం నడిచి పాకులు దాటి పశువులు, వేప చెట్ల వరుసలు- (ప్రహరీ గోడ దాకా వచ్చి) చూపు సారించాడు. ముసలాయన ఇక్కడి నుండే తన పొలాలల్లో ఏం జరుగుతుందో పసిగట్టేవాడు. ఇంటి వెనుక నుండి ప్రారంభమైన పెరడు-ఇంజన్ బావి లీలగా కన్పిస్తున్న పర్వతం. తూర్పు పడమరలుగా వ్యాపించి వున్న ఆ భూములను దక్షిణం వేపు ఏరు- ఏరులో ఇసుక తెల్లగా మెరుస్తోంది. ఉత్తరం వేపు పొడవైన పర్వత పంక్తి.

ముసలాయన చూపు గద్దలా గిరికీలు కొడుతుండగానే భూముల్లో,చెట్లకు కట్టిన జెండాలు కనిపించినయ్. ముసలాయన ముఖం ముడుచుకపోయింది. ఒక్క ఉదుటున పరుగెత్తి ఆ జెండాలన్నీ పీకేసి, తొక్కి కాల్చి వేస్తే...

ముసలాయనకు భార్య యాదికి వచ్చింది.

అడుగులో అడుగు వేస్తున్నట్లుగా నడిచి మళ్లీ వచ్చి తట్టు కుర్చీలో కూర్చున్నాడు. కళ్లు మూసుకున్నాడు.

తన భార్య ఈ ఇంటి కోడలుగా వచ్చిన తరువాతే ఈ సంసారం పెరిగిపోయిందని తల్లి తండ్రి అనేవారు. తిరిగి భార్యతోనే ఈ అదృష్టం, జమీ పోబోతోందా? ముసలాయనకు భార్య జ్ఞాపకాలు ముసురుకున్నాయి. ఆ జ్ఞాపకాలతో కలెగలిసిపోయిన భూముల జ్ఞాపకాలు కదిలాయి. ఏ చేను ఎక్కడ ఎత్తు పల్లాలు చదును చేసింది- ఎక్కడ బావులు తవ్వించింది- ఏ పెరడి పక్కన గల రైతుల పెరండ్లు తన పెరండ్లతో కలిసిపోయినవీ.. ఈ జ్ఞాపకాలన్నే కాదు. తన కాళ్లకింద నేల కదిలిపోయినట్లుగా గజ గజ వనికిపోయాడు.

ఈ ఇండ్లూ, భవంతులూ, భూములూ, జాగలూ, అధికారమూ ఇదంతా శాశ్వతమే అనుకున్నాడు. తరతరాలుగా తానెరిగిన జీవితం ఈ విధంగా తన కండ్ల ముందటే తల కిందులైపోతుందని ఊహించనైనా ఊహించలేదు.

"అసలిదంతా ఎక్కడ ప్రారంభమైంది?" ముసలాయన జ్ఞాపకం తెచ్చుకోవడానికి ప్రయత్నం చేస్తున్నాడు.

"పది పది హేనేండ్లవుతుందా?" ప్రతి ఎండాకాలం ఏటి నీళ్ల కోసం తనకు అడ్డం వచ్చే పులి మల్లారెడ్డి నలుగురు కొడుకులు. తనతో గెలువలేక ఊళ్లెకు పార్టీ వాళ్లను తీసుకొచ్చారు. ఎండిపోయిన చెరువులో పార్టీ వాళ్ళు సబ్బండ వర్ణాలను కుప్పేసి మీటింగు పెట్టారు. పాలేర్లకు జీతాలు- కూలోల్లకు కూళ్లు పెరుగాలన్నారు. తనుఎత్తుకు పై ఎత్తు వేశాడు. తనురంగంలోకి దిగకుండా పోలీసులు రంగంలోకి దిగి కొట్టి కొలాటమేశారు. మల్లారెడ్డి కొడుకులు మధ్యలోనే జారుకున్నారు. తనదే ఎప్పటికప్పుడు పై చేయి అనుకున్నాడు. విచిత్రంగా పార్టీ మాలమాదుగుల ఇండ్లల్లో కలెగలిసిపోయింది. వీరు ఫలానా అని తెలియకుండా అయిపోయింది. ఆ సంవత్సరం గడిచింది. మరో యేడు బంజరు భూములు దున్నుకుంటామన్నారు. తాను గాబరా పడలేదు. మిగులు భూములు పంచాలెనని గోడల మీద రాతలు రాస్తే- గోడల మీది రాతలు భూముల దాకా వచ్చేదెప్పుడు? అప్పుడు చూద్దామనుకున్నాడు. లోలోపల మసిలే మంట తాను గుర్తించలేదు. మంట కొడలు ఎగిసి అంతా ఉల్టా పల్టా అయ్యింది.

హైద్రాబాదు వెళ్లిపోయిన అన్నారెడ్డి జ్ఞాపకం వచ్చాడు ముసలాయనకు.

కొడుకు చూస్తే మండలాధ్యక్షుడు. వాని మనసులో ఏముందో చెప్పడు. తనకు తెలియకుండానే ఈ పదిహేనేండ్లల్లో సర్వం మారిపోయిందా? ఎవరు ఎటుకేసి కదులుతున్నారో? ఎదుగుతున్నారో తనకు తెలియడం లేదా? కొడుకులో కనిపించే అసహనం మాటేమిటి? వాడు ఆ వరదలోనే కొట్టుకపోతున్నాడా?

ముసలాయనకు ఏ దరి కనిపించడం లేదు.

ముసలాయన అట్లా తలపోసుకుంటున్న తరుణంలోనే ఆయన కొడుకు మధుకర్‌రెడ్డి అక్కడికి వచ్చాడు. ఖద్దరు పైజామా, లేత పసుపు రంగు లాల్చీ, మనిషి వేషం బాగానే వున్నా ముఖం వాడిపోయి వున్నది. కళ్లు మూసుకున్న ముసలాయన కుర్చీ పక్క కాసేపు నిలబడి ఏ సంబోధనా లేకుండానే "అందరూ భోజనాలకు కూర్చున్నారు. మీ కోసమే చూస్తున్నారు" అన్నాడు.

ముసలాయన మీరు కానివ్వండన్నట్లుగా కుడి చేయి ఊపాడు. తిరిగి కండ్లు మూసుకున్నాడు. మధుకర్ కాసేపు చూసి లోపలికి నడిచాడు.

ఫారెస్టు డిపార్టుమెంటులో రేంజర్‌గా పని చేస్తున్న ముసలాయన రెండో అల్లుడు బంగ్లా పై నుండి ఆయాసంగా దిగి వచ్చాడు. రేంజర్ ఎడమ కన్ను చాలా రోజుల కిందే పోయింది. అడవిలో కొమ్మ తాకి పోయిందంటాడు రేంజర్. కాని అది అబద్ధమని అడవిలో గిరిజనులు తరిమితే పరిగెత్తడంలో మెట్టు మీద పడిపోయాడని, కన్ను చితికిపోయిందని, మేక కన్ను పెట్టించుకున్నాడని లోకులంటారు. రేంజర్ ఎప్పుడూ నల్ల కల్లద్దాలు పెట్టుకునే వుంటాడు.

అప్పుడు అడివిలో కాదు- ఇప్పుడు గ్రామాలల్లో భూములు దక్కేట్టు లేవు. నగతు, బంగారంతో పాటు కరీంనగర్‌లో పెద్ద బిల్డింగ్ కట్టించాడు. రేంజర్ తన కున్న బొర్ర మూలకంగా వంగీ వంగనట్లుగా వంగి చొరవగా మామగారి చేయి పట్టి 'లేవండి మామయ్యా! లోపలంతా మీ కోసమే చూస్తున్నారు. వచ్చిన కర్మము సచ్చిన దప్పదంటరు. ఇట్లా రంధి పడి కూసుంటే ఎట్లా?" అన్నాడు.

ఒకరిద్దరు బంధువులు దర్వాజ దగ్గరే ఆగిపోయారు.


ముసలాయన కండ్లు తెరువలేదు. లేవలేదు. ఇలాంటి మాటలు సవాలక్ష తనూ చెప్పగలడు. ఉద్యోగాలు చేసేవాళ్లకు భూమి సంగతేమెరుక? దివంరాత్రుళ్లు తనుభూములచుట్టే తిరిగిన సంగతి వీళ్లకేమెరుక?

రేంజర్ మరోమారు ముసలాయన చేయి పట్టి "మీరు లేవకుంటే లోపలెవరూ మంచినీళ్లు కూడా ముట్టరు"

అక్కడికి విమల కూడా వచ్చి కాస్త దూరంలో నిలబడింది. విమలకు ఇలాంటి జీవితం కొత్తకాదు. ఈ తండ్లాటలు, పట్టింపులు తను పుట్టుకతో చూస్తున్నదే- కాని వీళ్లందరి నైజాలు అన్నీ తెలుస్తున్నాయి. విమల హన్మకొండలో కాలేజీలో చదువుకున్నది. తండ్రి పర్కాల తాలూకాలో పెద్ద భూస్వామే కాకుండా విత్తనోత్పత్తి క్షేత్రాలూ, కోళ్లఫారాలు, వరంగల్‌లో ఆటోమొబైల్ షాపు వగైరా వున్నాయి. రెండుసార్లు స్వతంత్ర అభ్యర్థిగా అసెంబ్లీకి ఆమె తండ్రి పోటీ చేసి ఓడిపోయాడు.

విమల అత్త చనిపోయిన దగ్గరి నుండి మామ, భర్త వాలకాలు చూసి కాస్త ఆశ్చర్యంలో మునిగింది. ఎప్పుడు బిర్ర బిగుసుకొని దర్పంగా, గంభీరంగా వుండే మనుషులు ఇట్లా కుప్ప కూలిపోతారను కోలేదు. మళ్లీ ఎన్ని గొడవలో, ఎన్ని కేసులో, పోలీసులు కొట్లాటలు అనుకున్నది. విచిత్రంగా ఈ మారు వాళ్ల మనసుల్లో ఏముందో కాని అలాంటి గొడవలైతే జరుగలేదు. అంత మంది చనిపోయిన అత్తగారి గురించి బాధపడుతున్నారా? పోయిన భూమి గురించి తర్జన భర్జన పడుతున్నారా? ఈ ఇంట్లో అన్ని రకాల అనుబంధాలు ఆస్తితో ముడిపడి వున్న సంగతి విమలకు బాగా అర్థమౌతోంది. తనలో... విమల తల విదిలించింది. చొరవగా మామగారిని లెమ్మందామనుకున్నది. కాని ధైర్యం చాలక అట్లాగే నిలబడిపోయింది.

ముసలాయన అక్కగారు కూడా వచ్చి నిలబడినది. అందరి ముఖాలు ఓ మారు చూసి పెద్ద గొంతుతో "బాంచెదాన్ని ఎంకటమ్మా అనే కాలం వచ్చింది. కాలం ఇట్లా వచ్చిందని తినకుంట, తాగకుంట ఏం సాధించుతర్రా... లే... లే.. లేసి



భోం చెయ్యి పో... మనం భూమ్మీద వుండచ్చినమా?'' అన్నది.

ఆమె మాటతో ఇద్దరు బంధువులు ముసలాయన రెండు చేతులూ పట్టి లేపారు. ముసలాయనకు లేవక తప్పింది కాదు. నిద్రలో నడుస్తున్నట్టుగా వాళ్ల వెంట బంగళా రెండో అంతస్తులోకి నడిచాడు.

గుట్ట బోరుకు సమీపంలో తూర్పు ముఖంగా ఉత్తర దక్షిణాలుగా పొడువుగా వ్యాపించి వున్న ఆ రెండస్థుల బంగళాలో ఉత్తరం వేపున వున్న పెద్దగదిని భోజనాల గదిగా వాడుతారు. ఆ గదిలో కూర్చుండి భోజనాలు చేస్తూ కూడా తన మొత్తం భూమిని చూసుకోవచ్చు. అందుకోసమే ముసలాయన భోజనాల గదిగా దాన్ని మార్పించాడు. ఆ గదికి ఎడమ వేపున్నే ముసలాయన పడకగది.

అప్పటికే ఆ గదిలో సుమారు పదిహేను మంది ముఖ్యమైన బంధువులు కూర్చుని వున్నారు. వారంతా ముసలాయన లాగే ఆ ప్రాంతపు ప్రసిద్ధ భూస్వామ్య వంశాల వారే! వారిలో వారికి బంధుత్వాలున్నాయి. అందులో రకరకాల వయసుల వాళ్లున్నారు. అందరూ ఆకలి మీదున్నారు. అప్పటిదాకా అంతూ పొంతూ లేని చర్చలు చేసి అసహనంగా వున్నారు.


ముసలాయన ప్రవేశంతో అందరూ ఊపిరి పీల్చుకొని కుర్చీల్లో సర్దుకున్నారు. విశాలమైన పడమటి కిటికీ ఎదురు కుర్చీలో ముసలాయన కూర్చున్నాడు... వద్ద వద్దనుకుంటూనే ఒక మారు అఖండమైన తన భూక్షేత్రాలకేసి చూసుకున్నాడు.

కలపివేసిన మూడు టేబుళ్లపైన బేసిన్ల నిండుగా పూరీలూ, గారెలూ, అన్నమూ, మేక తొంట్ల మాంసమూ, తలకాయ మాంసమూ, రక్తంతో చేసిన నల్లపొడి, పప్పులూ, చార్లూ, పచ్చళ్లు, పెరుగు సమస్తమూ వడ్డించారు.

మధుకర్ రెడ్డి, అబ్కారీ శాఖలో పెద్ద ఉద్యోగం చేసే అల్లుడు సుగుణాకర్ రెడ్డి ఇద్దరూ కలిసి టేబుళ్ల మీద బ్రాందీ, విస్కీ సీసాలు అమరుస్తున్నారు. మధుకర్ రెడ్డి కిందికి వచ్చి డ్రైవరును మరి కొంత 'సరుకు' కోసం తరిమాడు, డ్రైవరు ఆవులించుకుంటూ జీబు స్టార్టు చేసుకొని పోయాడు. గన్‌మెన్ కచ్చీరింట్లోకి వచ్చి చెక్క కుర్చీలో కూర్చున్నాడు.

లోపల రేంజర్ సాబ్ గ్లాసులో విస్కీ పోసి మామగారికి అందించాడు. ముసలాయన గొంతులో పోసుకొని మింగి సరాయించాడు.

సీసాలు మూతలు తిరుగుతున్నాయి. గ్లాసులు నింపుతున్నారు. భగభగ మండేవాళ్ల కడుపుల్లో పోసుకుంటున్నారు. ఆ మంట తగ్గడానికి బదులు హెచ్చుతూనే వున్నది. వంటింట్లో నుండి బేసిన్ల నిండా మాంసం సరఫరా ఔతూనే వున్నది. ఎముకలు కొరుకుతూనే వున్నారు. ఈతకల్లు కోసం ఒకరిద్దరు అడిగారు కానీ తెచ్చే వాళ్లు లేక తెప్పించలేకపోయానని




మధుకర్ చెప్పాడు.

అట్లా ఆకలి మీదున్న పులుల్లాగా తిన్నారు, తాగారు. అంతవరకే అయిపోయిన మాటలు మళ్లీ అందరి మెదళ్లలో మెదులుతున్నాయి.

ముసలాయన మెత్తటి మాంసం ముక్కల్ని కట్టుడు పళ్ల సహాయంతో నములుతున్నాడు. పదకొండు రోజులు మండిపోయిన కడుపు, నిద్ర లేని కండ్లు, గడ్డ కట్టుకపోయిన మెదడు... ముసలాయన ఎంతో మవునంగా అచ్చం ముసలి పులిలాగే తింటున్నాడు. పక్కనే కూర్చున్న అల్లుడు రేంజర్ గ్లాసు తరువాత గ్లాసు అందిస్తున్నాడు. ముసలాయన చడీచప్పుడు లేకుండా తాగేస్తున్నాడు. ఎవరో బర్రున అగ్గి పుల్ల గీకి సిగరెట్టు అంటించుకున్నారు.

ఎర్రగా కుది మట్టంగా బట్టతల మధ్యరకం బొజ్జా కలిగి చూడగానే షావుకారిలాగా కనిపించే పింగిలి రాఘవరెడ్డి గ్లాసు గొంతులోకి వొంపి, మింగి, గండ్లు మిటకరించి- ఎవరి ముఖం చూడకుండా ఓ మారు లేచి నిలబడి మళ్లీ కూర్చుండి...

"నేను నాటి నుండే చెప్తాన" అన్నాడు

ముసలాయన మొట్టమొదటిసారిగా అతన్ని చూస్తున్నట్లుగా ఓ చూపు చూసి ఏమీ పట్టనట్టు మాంసం ముక్క నమలసాగాడు.

రాఘవరెడ్డి "కాకా! కాకా! కాలం మనది కాకుండా పోయేటట్టున్నది. ఒక్కొక్క చెక్కని (భూమిని) పాతం పెట్టు అని- కాని కాకకు నా మాట మీద నమ్మకం కలుగలేదు" అన్నాడు.

"హుజూరాబాద్ పత్తి మాణిక్యమ్మ ఇల్లరికపు అల్లునికి భూముల సంగతేం తెలుసు. వీడు... కాలానికి ముందే సదురుకున్నట్టా? భూములన్నీ అమ్ముకొని ఇద్దరు బిడ్డల పెండ్లిల్లు చేసిండు. లక్షలుకట్నాలిచ్చి చదువుకున్న అల్లుండ్లను దొరబట్టిండు. అమెరికాలో ఒకడు, ఇరాన్‌లో మరొకడు- ఊళ్లె ఇంటికి తాళం బెట్టి వరంగల్‌ల మకాం బెట్టిండు. మేన్ రోడ్డు మీద రెండు బంగ్లాలు, కిరాయులు, కొంత వ్యాపారం. వీడికి రూపాయిలు తప్ప భూముల సంగతేం తెలుసు?''

ముసలాయన మనసులో అనుకున్నాడు.

ముసలాయనకు తన దినచర్య గుర్తొచ్చింది. పొద్దున నాలుగు గంటలకు నిద్ర లేవడం, పని పాటల వాళ్లను నిద్ర లేపి టిఫినూ, ఛాయా కానిచ్చి- పొద్దు పొడిచే సరికల్లా తను గొడుగూ, జేబులో పొగాకు చుట్టలు వేసుకొని ఇంటెనుక తలుపుల గుండా బయటకు వెళ్లేవాడు. ముందు ఎడమ పక్క ఏటి కాల్వ వరి పొలాల్లోంచి ఒక్కొక్క వరి మడిని తనివి తీరా చూసుకుంటూ నీరటి కాళ్లతో మాట్లాడుతూ గుట్ట మొదటి దాకా నడిచేవాడు. అక్కడ కుడివేపు తిరిగి ర్యాగటి భూములూ, చేండ్లూ, మిరప తోటలు చుట్టేసి మధ్యాహ్నానికల్లా ఇంటికి చేరుకునేవాడు. మద్యాహ్నం స్నానాదికాలు కానిచ్చి తిరుమని నామం పెట్టుకొని పూజ చేసి, తాటి కల్లు కాలంలో తాటికల్లు, ఈతకల్లు కాలంలో ఈతకల్లు తాగి భోజనం కాగానే కాసేపు పగలు పడుకునేవాడు. పొద్దు వంగగానే లేచి బంగళా ముందున్న పాత చింత, యాప చెట్ల కచ్చీరు గద్దెపై కూర్చొని ఊళ్లో పంచాయతులు విని తీర్పులు చెప్పేవాడు. సాయంత్రం మళ్లీ తోటలు, పెరండ్లు తిరిగి వచ్చి పని పాటల గాళ్లతో అవసరమైన మేరకే మాట్లాడేవాడు. ముసలాయన దిన చర్య ఈ రకంగా ఇంచుమించు సాగుతూ వచ్చింది.

"ఒకరోజు చూడకపోతే భూదేవి మొఖం మాడుస్తది'' అనేవాడు ముసలాయన కొడుకుతో. అట్లా గద్దచూపుతో, దయ్యం లాగా రోజు భూముల చుట్టూ తిరిగేవాడు. భూముల సరిహద్దుల్ని నిశితంగా పరిశీలించేవాడు.

ఎవరు ఏం మాట్లాడకపోయేసరికి రాఘవరెడ్డి మరేదో చెప్పబోయాడు.

"హన్నా వీడెంత వీని బిషాదెంత?'' కటుకూరి కృష్ణారెడ్డి మనసులో అనుకొని- తన కొడుక్కు బిడ్డనివ్వలేదన్న లోపలి కోపంతో- పైకి మాత్రం వ్యంగ్యగా నవ్వి

"నిజామాబాద్ వైపు షావుకార్లందరి జాట్లు

సట్టేలడ్లట..'' అన్నాడు.

ఆ మాటకు రాఘవరెడ్డి ముఖం వివర్ణమైంది. అది గమనించిన కృష్ణారెడ్డి 'పింగిలోని మీద కటుకూరోని దెబ్బ బాగనే పని చేసిందని' హుశారుగా మూలుగు బొక్కను ఎగపీల్చాడు. ఇంకా కృష్ణారెడ్డికి మూడు గ్రామాలలో ముసలాయనలాగే ఎర్ర జెండాలు పాతిన భూములున్నాయి.

''నిజామాబాద్‌లోనే ఏంది? పట్నాలల్లో చేరిన బిజినెస్‌దార్ల బొక్కలిరిసి లక్షలు కోట్లు వసూలు చేస్తున్నరట. ఈ రోజు పేపర్లు రాసినయ్'' అన్నారెవరో జనాంతికంగా...

రాఘవరెడ్డి నిషా దిగింది. మరో గ్లాసు బ్రాంది నింపుకొని గట గట నీట్‌గా కొట్టేశాడు. రాఘవరెడ్డి ముఖం మీద చిరుచెమటలు ముసలాయన గమనించాడు. మరొకాయన నాటక ఫక్కీలో చేతులుతిప్పుతూ ''బేష్! బేష్! ముమ్మాటికి నిజం. ఎక్కడికి పారిపోయినా యుద్ధం తప్పదు. అమ్ముకుపోంగానే అయిందా?'' అన్నాడు. అతనికినెరిసిన తల అంటుడు కడుపు. ఆయన పేరు కాసర్ల వీరారెడ్డి. వీరారెడ్డి గారిని రెండుసార్లు భూముల గొడవల్లో గ్రామస్తులుకొట్టారు. ఊళ్లో సర్పంచ్ పదవికి దండం పెట్టి తాలూకా సెంటర్లో అబ్కారీ మాములా పట్టుకొని నెట్టుకొస్తున్నాడు. ఎన్నటికైనా మంచిరోజులు రాకపోతాయా అని ఎదురు చూస్తున్నాడు.

వీరారెడ్డి మాటలు శ్రద్ధగా వింటున్న ముసలాయన మద్దతుగా తలాడించాడు. మెత్తటి మేక కార్జం నోట్లో వేసుకున్నాడు. ఒకరిద్దరు వీరారెడ్డిని మెచ్చుకున్నారు. దానితో వీరారెడ్డికి వీరావేశం వచ్చింది. ప్రక్కనున్నాయనకు బ్రాంది బలవంతంగా వంపి ''మన దాంట్లోనే పిరికి పిత్తుల ముండా కొడుకులున్నారు. మా దగ్గరనే పోల్సాని నరింసగరావని వున్నడు. పేరుకే ఎలుమ పుట్టుక- గజగజవనికి తట్టెడు ఏరుక్కొని వాని చేత్తోనే వాడు వాని భూమి రాసిచ్చిండు... అట్ల మనమున్నంక కుంటి పోషిగాడు కూడా గోసి పెడుతడు. వాళ్లెట్ల ఏకమై తండ్లు మనమూ? ప్చ్...'' వీరారెడ్డి చప్పరించాడు.

''పోనీ మీరు రెండుసార్లు తన్నులు తిని మీ భూములు మీరు దున్నుకోగలిగారా?'' పింగిలి రాఘవరెడ్డి ఎదురు ప్రశ్న వేశాడు.

''వానమ్మల... ఒక్కొక్కన్ని...'' వీరారెడ్డి ఆవేశపడిపోతూ గ్లాసును టేబుల్ మీద గుద్దాడు. గ్లాసు పగిలింది.

మధుకర్‌రెడ్డినిశబ్దంగా వచ్చి గాజు ముక్కలు తీసివేశాడు.

కాసర్ల వీరారెడ్డికి ఆవేశం తగ్గి కుర్చీలోన కూలబడ్డాడు. క్రమంగా అతని ముఖం చిన్న బోయింది. ఎవరో మరో గ్లాసు నింపి చేతికిచ్చారు. అంతమందిలో దెబ్బల ప్రస్తావన... అయిదు నిముషాలు ఎవరు మాట్లడలేదు.

మధుకర్‌రెడ్డి కిటికీలో నుండిబయటకు చూస్తున్నాడు. కొడుకు ముఖంలో ఏముందో ముసలాయనకు అంతుబట్టలేదు.

కాసర్ల వీరారెడ్డి కూడదీసుకొని ''నీ అసొంటోళ్లంత గాజులు తొడుక్కొని అనుమ కొండకు, కరీంనగర్‌కు దెంకపోతే- నా అసొంటోల్లకు... ఖైర్... రెడ్డి పుటుక పుట్టిందెందుకు? పుట్టిందోనాడు సచ్చేదోనాడు''

అతని మాట పూర్తి కాకముందే ''అట్లనే సస్తవురా కాసర్లోడా? కాలం బట్టి మారాలె'' రాఘవరెడ్డి అచ్చం షావుకారి లాగానే చేతులు తిప్పాడు.

దానితో సదరు కాసర్లాయన ''నప్పతల్ల ముండాకొడుకులు'' అనుకుంటూ ఊడిపోతున్న గోచీని బిగించుకుంటూ బయటకు నడిచాడు. ఈ రెండు వాదాల్లో దేన్ని బొపనాలో తెలియక మరొకాయన తను బయటకు వస్తూ ''అబ్బ ఏం ఉబ్బరిస్తుంది. వర్షం వచ్చేటట్టున్నది'' అన్నడు.

ఆయన మాటలెవరు పట్టించుకోలేదు. గదిలో మాంసం, పూరీలు, బ్రాందీ వాసనలతో పాటు సిగరెట్ల పొగ నిండింది... వీరారెడ్డి మాటలతో అక్కడ ఒక విధమైన స్తబ్దత ఏర్పడింది. దాన్నుండి తప్పించుకోవడానికి కవోపంగా ఎముకలు పరపర కొరుకుతున్నారు. గట గట తాగుతున్నారు. సిగరెట్లు ఊదుతున్నారు. ఎవరి అలోచనల్లో వాళ్లున్నారు. ముసలాయన కొట్లాడడమా? తోక ముడుచుకొని కూర్చుండటమా అనేది తేలక తన చిరకాల బ్రాండ్ చార్‌మినార్ సిగరెట్టు ముట్టించాడు.

ఇదంతా విసుగ్గా తోచి మధుకర్ కిందికి కేకేశాడు. విమల వంట మనిషిని పిలిచి పైకి పంపించింది. పైకి వచ్చిన వంట మనిషితో- '' ఒక్కసారి టేబుళ్ల మీద చూడు ఏం తక్కువున్నదో?'' చూడుమన్నట్లుగా విసుగ్గా సైగ చేశాడు. వంట మనిషి టేబుల్ల చుట్టు తిరిగి చూశాడు. అన్నం అట్లాగే వున్నది. పూరీలు, మాంసం, గారెలు మాత్రం ఎగిరిపోతున్నాయి. ఖాళీ పాత్రలు తీసుకొని కిందికి దిగాడు. తను చూసిన సీను వంట మనిషి విమలకు చెప్పాడు. విమల అదో రకంగా నవ్వింది.


''దీనికి గింతగూడ రంధి ఉన్నట్టు లేదే'' ఒక ఆడబిడ్డ మరో ఆడబిడ్డతో గుసగుసగా.

అప్పటికే మధుకర్‌రెడ్డి కిందికి దిగివచ్చి సిగరెట్టు ముట్టించి ఈ త తంగానికి ఎడంగా నిలుచున్నట్లు నిల్చున్నాడు. భూమి పేరెత్తుతేనే ఇంత గొడవ జరుగుతోంది. మరింక దాన్ని నిలుపుకోవాలంటే ఎంత పోరాడాలి. అవతలి పక్షం మునుపటి లాగా లేదు. యుద్ధ రేఖ మీద అటు యిటు రడీగా మోహరించి యున్నప్పుడు... మళ్లీ చిక్కు పడుతోంది. విసురుగా సిగరెట్టు పారేశాడు. ఏటి మీద వేలాడే మబ్బు తునక మధుకర్‌ను ఆకర్షించింది. తల్లి జ్ఞాపకం వచ్చింది. ఇప్పుడు జరుగుతున్న దిన వారాలు పూర్తిగా అసంబద్ధంగో జరుగుతున్నట్టుగా తోచింది. ఎడం చెయ్యి పొద్దున్నే సున్నగా గీకిన గుండు మీదికి పోనిచ్చాడు. పొద్దటి కర్మ కాండ తంతు జ్ఞాపకం వచ్చింది. విసురుగా మెట్లెక్కివచ్చాడు. అప్పటికే టేబుళ్ల మీద సీసాలు అయిపోవచ్చాయి. రేంజర్ బావమరిది రావడంతోటే తాళం చెవులు తీసుకొని బీరువాలో నుండి మరిన్ని సీసాలు తీసి టేబుల్ మీద సర్దాడు. కాసేపు అతిథులు ఆ కొత్త సీసాల గురించి మాట్లాడుకున్నారు. ఆనవాయితీ ప్రకారంగా తాగుడు ఖర్చు అతిథులు దగ్గరి బంధువులు తెస్తారు. ఆ మాటల సారాంశం ఎవరెన్ని సీసాలు తెచ్చామనేదే!

వాతావరణాన్ని తేలిక పరచడానికన్నట్టు అబ్కారీ ఆసామీ స్కాచ్ విస్కీ మూతను చిట్టుక్కున్న తిప్పి

## కమలకాంతి

చాలా కొద్దికాలంలోనే తారాజువ్వలా ఎగిరి రాజకీయ ప్రపంచంలో అగ్రస్థానం సంపాదించుకున్న మహిళ కమలాదేవి చటోపాధ్యాయ. ఆమె ఉప్పు సత్యాగ్రహం ప్రారంభానికి ముందు బొంబాయి అజాద్ మైదానంలో ఇలా గర్జించింది. ''మనం ఈ రోజు ఒక గొప్ప తిరుగుబాటుకు అంకురార్పణ చేస్తున్నాము. ఉప్పుచట్టాన్ని తిరస్కరించడం ఒక్కటే మన ధ్యేయం కాదు. ఈ పిడికెడు ఉప్పును చట్టవిరుద్ధంగా తయారుచేయడంలో మన లక్ష్యం భారతదేశంలోని బ్రిటిష్ అధికారాన్ని నామమాత్రంగానే మిగల్చడం కోసమే''.



ఇంత ధైర్యంగా చెప్పిన ఈమె హరీంద్రనాథ్ చటోపాధ్యాయుని భర్తగా పొంది ఆయన పనులు కొన్ని సరిపడవని విడాకులిచ్చిన వనిత కూడా. ఈమె అఖిల భారత మహిళా సంఘాధ్యక్షురాలు. గొప్ప నాయకురాలు.

— జె.లలితాదేవి

వీరారెడ్డి కుర్చీ పక్కనిలబడి అతనిముందు గ్లాసులో మందు పోస్తూ ''తాతా నువ్వు ఏదైన కూరగాయల వ్యాపారంలోకి దిగడమే మంచిది'' అన్నాడు.

''నేను కూరగాయల వ్యాపారంలోకి దిగితే మీ డిపార్టుమెంటోళ్లంత మనిషికో నాలుగు బర్లు కొనుక్కొని పాల వ్యాపారం చేస్తుడి'' అన్నాడు. ఆ మాట అనవైతే అన్నాడు గాని తన అబ్కారీ నడచేటట్లు లేదని ఖచ్చితంగా తెలుస్తూనే వున్నది. వీరారెడ్డి విసురుగా బయటకు వెళ్లి ఆలోచించాడు. 'వీళ్లందరికి లేని దురద తనకెందుకు?' అనుకొని వచ్చి కూర్చున్నాడు. మళ్లీ వాదన తన మీదికే వస్తోంది... బీరవోలు సురేందర్ రెడ్డిలాగా ఎరువులు, పురుగు మందులో, అడ్తినో, కరెంటు మోటర్లో ఏదో వకటి...

ముసలాయన కిటికీలో నుండి దూరంగా సుదూరంగా దృష్టి నిలిపాడు. ఆకు రాల్చిన చెట్లతో, పొదలతో కుడి పక్క గుట్ట బోరంతా బెక్కన బెంగటేలినట్టున్నది. ఎండలో పశువులు, మేకలు అసహనంగా అటు యిటూ తిరుగుతున్నాయి. ఎక్కడో ఒక మేక హృదయ విదారకంగా అరుస్తోంది.

అందరూ మరో రెండు మందుకొట్టారు.

కాసర్ల వారికి ముందే బిజినెస్‌లో సెటిలైపోయిన పింగిళి వారి మీద పీకల మంటి కోపం వచ్చింది. కట్కూరి కృష్ణారెడ్డికి అప్పటికీ మందుఎక్కువై పోయింది. లేచి గోడకు ఒరిగి కూర్చున్నాడు. ఆయనలో ఆయన ఏదో గొనుక్కుంటున్నాడు. మరొకరెవరో గ్లాసుడు విస్కీ టేబుల్ మీద ఒలుక బోశాడు.

''ఆఖరుకు సీలింగ్ గొడవల్లోంచి కూడతోటల పేరు మీద పంట భూములు పోకుండా చేసుకోగలిగినా!'' ముసలాయన ఎదురు కిటికీ దగ్గరి నుండి లేచి కుడివైపు కిటికీ దగ్గరికి నడిచాడు. ఆకులలములు లేక ఎండిపోయిన ఆ గుట్ట బోరు ఆవలివేపు ఎలుగడిపడ్డట్టున్నది. గుట్ట పైభాగంలో పొగలు సెగలు కనిపిస్తున్నవి. ఆకు ఊగడం లేదు. కొమ్మ కదలడం లేదు. కాలం భగ భగమంటల్లోనే స్తంభించిపోయినట్లుగా తోచింది. ఎందుకో ముసలాయనకు అటు చూడబుద్ధికాలేదు. తిరిగి టేబుల్ల వద్దనే వచ్చి కూర్చున్నాడు. నింపి వున్న గ్లాసును గడ గడ తాగేశాడు.

''దొంగ లంజా కొడుకులు! వాళ్ల దాంట్లున్న కట్టు- మన దాంట్ల లేదు''

హఠాత్తుగా వీరారెడ్డి లేచి నిలబడి అరిచాడు.

ఆ కారణంగానే పింగిళాయనకు కోపం హెచ్చింది. ముఖం తోమిన రాగి చెంబులాగా ఎర్రబడ్డది. విస్కీ సీసాను విసరుగా టేబుల్ మీద పెట్టి వీరారెడ్డి మీది కురికాడు.

మధుకర్‌రెడ్డికి ఈ గొడవ బోధపడేసరికే రాఘవరెడ్డి వీరారెడ్డిని కిందపడదోసి మీద కూర్చున్నాడు. గ్లాసులు బొకబొక లాడాయి.

## ఎర్రబడిన తూర్పు

తుప్పపట్టిన మతవాదం కత్తిని
మెదల మీద నూరుతున్న వప్పుడు...

దోపిడీ దౌర్జన్యాల విందుకు
శాంతి కపోతం రెక్కలు విరుగుతున్న వప్పుడు
తల్లి ఒడిలోని పాపాయిని
రోత రాజకీయ రంపం నరుకుతున్న వప్పుడు
కనిపెంచిన పదుచు జంటను
బజారు కుక్కలు కాటికి కరుచుకపోతున్న వప్పుడు
తెగిపడిన అవయవాలు
జాతిని కుదిపే ప్రశ్నలై మొలుస్తున్న వప్పుడు
మానవత్వం ఊపిరాడక
గూండాల గుప్పిట్లో నలుగుతున్న వప్పుడు-
నిరుపేదల, నిస్సహాయుల ఆర్తనాదాల్ని
అంతా ప్రశాంతంగా సర్కారు
బొంకుతున్న వప్పుడు...
రక్తం కాలువలై
మూసీ కన్నీటి ఉప్పెనై చరిత్ర పుటల్ని
తడుపుతున్న వప్పుడు
రోజు కూలీ అతుకులు బతుకు మీద
కర్ఫ్యూ కరాళ నృత్యం చేస్తున్న వప్పుడు...
గురి తప్పిన తుపాకులు
జనం గుండెల్లో కవాతు చేస్తున్న వప్పుడు-

ఈ నిమిషాన
ఎర్రబడిన తూర్పు
కాలం కొమ్మకు పూచిన
అందమైన ఉదయం కాదు..
ఎర్రబడిన తూర్పు
అద్దాల వెక్కిళ్ళ తళుకు కాదు
అధరాల ఆరోగ్యపు మెరుపు కాదు

ఎర్రబడిన తూర్పు
చెదిరిన కుంకుమల పొగ...!
ఎర్రబడిన తూర్పు
ఎగిసిన దహనాల సెగ...!
ఎర్రబడిన తూర్పు
చిందిన నెత్తుటి ధార
ఎర్రబడిన తూర్పు
మానవతా వాదుల కంటి జీర...!!

—సదానంద్ శారద

''ఆగుండ్లీ ఆగుండ్లీ'' అంటూ లింగారెడ్డి వాళ్లిద్దర్ని విడదీసి కుర్చీల మీద కూర్చున్నాడు. ఆ పార్టీలో ఇంతవరకు ఏం మాట్లాడకుండా కూర్చున్నదతనే. పైగా బెదురో మరెందుచేతనో అందరికన్నా తక్కువ తాగిందతనే.

''మనం మనం అనుకొని ఏం లాభం. కాంగ్రెసు గవర్నమెంటునవాలె'' అంటూ తేల్చి పారేశాడు మరొకాయన.

ముసలాయనకు ఉద్రిక్తంగా వున్నది. అతనుఏదన్న మాట్లాడ్తే కొంత టెన్షన్ తగ్గునేమొ?

అంతలోనే ఇవన్నీ తెలిసీ తెలియని రాజకీయ చర్చలనే నిర్ధారణతో- ''మీ ఆలోచనలన్నీ శుద్ధ వేస్టు'' అంటూ బ్రేవ్ మని త్రేన్చిండు మందల ముకుందారెడ్డి. ముప్పయి సంవత్సరాల క్రితం అతను ప్రజా సోషలిస్టు పార్టి ఎమ్మెల్లే క్రమంగా అతనికి సోషలిస్టు పార్టీతో కూడ పడలేదు. ఆ పార్టీకి దూరంగానే వున్నాడు. అప్పుడప్పుడు పెల్లుబికే ఆ ప్రాంతపు ఆందోళనల్లో అతనుంటాడు. ఆయన భూములుకూడా ఆగే విధంగా లేవు. భూములు పోతే పోయాయి పేరన్నా దక్కేటట్లు చూడాలని ఆరాటం. అదీ దక్కే విధంగా లేదు. నైజాం కాలంలోనే బాగా చదువుకున్నాడు తండ్రి దేశ్‌ముఖ్.

ముకుందరెడ్డి మాట చాలా మందికి అర్థం కాలేదు.

ముకుందరెడ్డి తనే చొరవ తీసుకొని మాట్లాడసాగాడు.

''చెన్నను తిట్టే లాభం లేదు. అన్నను అనీ లాభం లేదు. సింగ్‌ను అనీ ఫాయిదా లేదు. సాక్షాత్తూ రష్యా గోర్బచేవే చేతులెత్తేసిండు... ప్రపంచం యావత్తూ సుళ్ళు తిరుగుతోంది''

ఆయన మాటలకు చాలా మందికి జ్వరాలు వచ్చినట్టయ్యింది.

ముసలాయన అట్లాగే సన్నగా ఊగులూగుతూ ముకుందరెడ్డి వైపు చూస్తూ ఏదో అనాలనుకున్నాడు. ''ఎందుకిట్లయ్యింది?'' అన్నాడు రేంజర్. చాలా మందికి ముకుందరెడ్డి చెప్పే వివరాలు తెలిసినవే-కాని ఆ అంతస్సూత్రమే తెలియదు. తెలిసినా అంత స్పష్టంగా తెలియదు. మధుకర్‌కు ఆసక్తిగానే కాకుండా కొంచెం ఆందోళనగా అన్పించింది.

''ఎందుకంటే వెరీ సింపుల్. ఉత్పత్తికి-పంపకానికి మధ్య లేచిన గొడవ ఇది. ఎవడు దీన్ని కాదనలేదు. ఆపలేదు'' ఖరాఖండిగా చెప్పాడు.

చాలా మందికిఈ గొడవేమిటో అర్థం కాలేదు... ఇంకాలోతులకు వెళ్లడానికి ఒకరిద్దరు భయపడ్డారు కూడా...

''అయితే ఇగ మనం ఏం చెయ్యలేమా?'' బేలగా ఒకాయన...

ముకుందరెడ్డి ముఖం రుద్దుకున్నాడు ఏడం చేత్తో... కాస్త నెమ్మదిగా చెప్పాలనుకున్నాడేమొ? మనమేమి చెయ్యలేం. వాళ్ల దయ తలిచి మనకు ఎంత భూమి యిస్తె అంత. అంతకు మించి మనం ప్రస్తుతానికి ఏం చెయ్యలేం'' ముకుందరెడ్డి కావాలనే ప్రస్తుతానికి అనేమాట ఒత్తి పలికాడు.

ముసలాయలో ఆ కాస్త బిగువు సడిలింది. ముఖం వేలాడేసుకున్నాడు.

''వాళ్లిచ్చేదెంత?'' అన్నాడు పింగళి రాఘవరెడ్డి

ఈ ప్రశ్నతోముసలాయనలో కాస్త ఆశ

చిగురించింది. ఇన్ని వంద లెకరాలు అంతా తీసుకుంటారా? తనకు ఎంతిస్తారు? ముసలాయనకు కాస్త ఆధారం దొరికినట్లనిపించింది.


ఇందాక జరిగిన వాదోపవాదాల సారాంశంగా ఈ ఉప్పెన ఎట్టి పరిస్థితుల్లో తప్పేటట్టు లేదని అర్థమౌతోంది. ముసలాయనలో లోపల ఏదో పేలడానికి సిద్ధమౌతోంది. కనీసం దాని స్వరూపం ఎట్లా వుంటుంది? ముసలాయనలో ఆరాటం హెచ్చింది.

"జిల్లాలోని ప్రాంతాలను బట్టి, భూమి స్వభావం బట్టి, భూస్వామి నడవడి బట్టి- భూస్వామికి ఈ భూములు కాక ఇంకా వున్న స్థిరాస్థులను బట్టి-" ముకుందరెడ్డి జిల్లాలోని భూముల వివరాలుచెప్పి ఇట్లా తీర్పులు చెప్పారు అన్నాడు. తను ఎందులోనూ వచ్చే సూచన ముసలాయనకు కన్పించలేదు.

"అసలు ఈ భూముల పంపకం కిందికిందోళ్లే వేస్తున్నరట" పీరారెడ్డి అన్నాడు అక్కసుగా.

"వాళ్ల వీళ్లు వేరు కాదు లేవయ్యా! చేతులు, నోరుఒక సెత్తయే" అని విసుక్కొని "ఇంతకూ వరంగల్ సభల వాళ్లేం చెప్పిండ్లుర బాపూ" అన్నాడు మధుకర్ వేపు తిరిగి.

మధుకర్‌కు ఈ రకమైన చర్చలే ఇష్టం లేదు. నిజానికి ఈ పరిగామంలో తానెక్కడ నిలబడాలన్న




దాని గురించి అందరికన్నా ఎక్కువ ఆలోచిస్తున్నదతనే.

"వాళ్ల చెప్పిందానిబట్టి మంచి భూస్వామికి మన ఏరియాలో పదెకరాలు వుంచవచ్చు" మధుకర్ అయిష్టంగానే-

"కుటుంబంలో ఎందరున్న గంతేనా?"

"మేజరు పిల్లలైతే వానికి వాటా వుంటుంది. పెళ్లి కావాల్సిన ఆడపిల్లలుంటె కొంత మినహాయింపు" ముకుందారెడ్డి.

ముసలాయనకు ఉక్రోషం ముంచుకొచ్చింది. వందలెకరాలు సాగుచేయించిన తనకు పదెకరాలా?

ముసలాయనకు ముక్కుల వెంట నీళ్ల కారుతున్నాయి. కండ్లు ఎర్ర బడిపోయినయ్.

మిగతా వారంతా లెక్కలు కడుతున్నారు. కూడికలు, తీసివేతలు, అట్లా కాదని ఒకరు అరుస్తున్నారు. లొడలొడ మాట్లాడుతున్నారు. హఠాత్తుగా వాతావరణం ఉద్రేక భరితమైంది.

ముసలాయన లేచి నిలబడ్డాడు. నిషా కన్నా అతని




హిమాచల్ ప్రదేశ్‌లో 'రోతంగ్ కనుమ' 13 వేల అడుగుల ఎత్తుమన్న బియాస్ నది పుట్టుక స్థలం. కొద్ది నెలలు టూరిస్ట్ల రాకపోకలకు అనుకూలమై వుంటుంది.

# దేవతల లోయలో రోహ్‌తాంగ్ కనుమ

పరుష పీట వణికిందొక మంచు శిఖరం!
శిరసుపైన మబ్బులున్న రోహ్‌తంగ్ శిఖరం!
అడుగు సాచి నడువమనే
నడుమ లోయ నీలమణులు
నడుము కట్టే గరికెలోన
సారించితి చరణమ్ములు.
అడుగుతీసి అడుగు వేస్తు, కొండ దీటు చూస్తూ,
అడుగులోన అడుగువేస్తు, మబ్బు గొడుగు చూస్తూ,
అడుగడుగున అబ్బురంగ మంచు తెలుపు చూస్తూ
అడుగులు పదమూడు వేల ఎత్తని వెరవక చూస్తూ
బడలిక మరచిన ఎడదొక
బెదరు కాగ కాళ్ళకు,
నడువగ నడువగ కడకొక
మడుగు తగిలె కళ్ళకు.
అరె! రెపరెపరెప రెపరెపరెప!
పరుష పీట వణుకుతూంది మంచు శిఖరం!
శిరసు మీద మబ్బులున్న రోహ్‌తంగ్ శిఖరం!
"దేవతలది లోయైనా శితరుతువు ఇంతే!
ఎత్తుల్లో, మంచుల్లో ఏదైనా అంతే!"
తేటనవ్వు తీరుపిచ్చి, తేరిపార చూచి,
తేరుకున్న ఊర్పు విడిచి, వెనుదిరిగావంతే!
రోతంగ్ శిఖరాలు గాలి సుడులకి గుడులైనయ్!
అడుగులు పడనీని గాలి పిడిగుద్దులు పడినై
హెచ్చిన ఆ రొద వింటే, ముప్పొచ్చిన మహోపదం!
పిచ్చిగ కొండల మోగే పెడగాలికి ఎదురీదాం!
ఎప్పుడెరుగనట్టు పట్టి, అదరగొట్టి, వెదరగొట్టి,
ఉరవడించి, ఉక్కుచేత కండ్ల నీళ్ళు తుడిచిపెట్టి,
మతిమాలిన అల్లరితో మణిపురి షాల్ విసిరికొట్టి,
'ఉస్సు'రన్న, 'ఉఫ్'మన్న, మంచుగాలి మంట పెట్టి,
గడగడలాడించిందా గాలి లోకందేవా!!
ఘనవాహనిలా గడచిన అది వేవెరిగినదేవా???
రోతంగ్! హే రోతంగ్!
రోతంగ్! ఓ రోతంగ్!
వ్యాసనదీ జన్మకుండం!
ఇదె మా సోదర దండం!

—సుజాతా షా

శరీరంలో కోపం చేరి మనిషి సాంతం ఊగుతున్నాడు. అయినా తనను తాను సంబాళించుకునే ప్రయత్నం చేస్తూ...

"అయితే నాకూ! నా కొడుక్కూ నా ఇల్లరికపు అల్లునికీ కలిపి పదెకరాలన్నమాట- అదీ దున్నుకుంటేనే? నేనూ నా కొడుకూ నాగలి గట్టి దున్నుకోవాలె..." అన్నాడు.

ఎవరి నిషాలో వాళ్లుండి ముసలాయనను పట్టించుకోలేదు.

ముకుందరెడ్డి ఓరగా చూసి బర్రున అగ్గిపెట్టె గీకి సిగరెట్టు ముట్టించుకొని ముక్కుల్లో నుండి పొగ వొదులుతూ "యస్... మామా..." అన్నాడు.

ముసలాయన నోట మాట రాక ఊగిపోయాడు. టేబిల్ మీది గారెల గిన్నె తీసి విసిరి కొట్టాడు. అదృష్టవశాత్తు అది ఎవరికి తాకకుండా గోడకు తాకి బొకబొకలాడింది. అందరూ ముసలాయనకేసి తిరిగారు.

ముసలాయన ముఖం చూస్తే అందరి మీద ఆ మూడు టేబుల్లు తిరగేసి కొడుతాడేమో ననిపించింది.

ఆ శబ్దానికి వంటవాడూ, ఆ వెనుక ఆడవాళ్ళ పరుగెత్తుకొచ్చి గది బయటే ఆగిపోయారు. వంటవాడు ముసలాయన ముఖంచూసి గోడ దగ్గరే ఆగిపోయాడు.

ముసలాయన చరచరా కిటికీ దగ్గరికి నడచాడు. అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఆడవాళ్లు ఏదో గుసగుస లాడుతూ దిగిపోయారు... అందరికీ ఎంతో కొంత నిషా దిగినట్టే అన్పించింది. ఆఖరి పెగ్గులు నింపుకున్నారు.

ముసలాయనకు లింగారెడ్డి వనికే చేతులతో గ్లాసు తెచ్చి యిచ్చాడు.

ముసలాయన లింగారెడ్డి ముఖంలోకి చూశాడు. అతని ముఖంలో ఏముందో ముసలాయనకు అర్థం కాలేదు. తనకు వద్దన్నట్టు తోసేశాడు. ముసలాయనకు ఏదో నిషా కన్నా గాఢంగా సోకుతోంది. భూములు మసకమసకగా కనిపించాయి. ఆలోచనలు తెగిపోయినట్లుగా- కాసేపు ఏమీ అర్థం కాలేదు. తిరిగి కుడివైపు కిటికీ లోంచి గుట్ట బోరు వేపు చూశాడు. దూరంగా లీలగా విన్పించిన గొడ్డలి చప్పుడు అంతకంతకూ దగ్గరై పెళ పెళ చెట్లు కూలుతున్నట్టుగా విన్పిస్తోంది.

విచిత్రంగా ముస లాయన కళ్లల్లో నీరు బుస బుస పొంగింది.

ముసలాయన ఒక్కసారిగా బద్దలైపోయి బోరున ఏడ్వసాగాడు.

రేంజర్, లింగారెడ్డి ఒరిగిపోతున్న ముసలాయనను పొదివి పట్టుకొని కుర్చీలోకి చేర్చాడు.

ఈ హఠాత్సంఘటనకు అంతా దిమ్మెరపోయారు. ముసలాయన ఏడ్వకుండా ఆ గదిలోని మొత్తం సామాను విసిరికొడితే- విరిచేస్తే వాళ్ళంతా కించిత్తు కూడా ఆశ్చర్యపడకపోయేవారు. అందరికీ ఊహించని దౌర్భాగ్యపు అనుభవమది.

మధుకర్‌కు తండ్రి ఏడవడం బావుండలేదు. 'ఇంతదాకా అక్కడ చేరిన వాళ్లంతా తనకన్నా ముందే తమ తమ స్థానాలలో భద్రంగానే నిలబడినట్లనిపించింది. మధుకర్ ఒక్కొక్క మెట్టే దిగి ఇంటి ముందుకు వచ్చి నిలుచున్నాడు. గడియారం చూసుకున్నాడు. మూడు గంటల యాభై నిమిషాలు- గుట్ట మీద మేఘాలు కుదురుకుంటున్నాయి. గాడుపు దుమారం వచ్చే లాగున వున్నది...

మధుకర్ నిశబ్దంగా నిశ్చలంగా నిలబడి రెండు సిగరెట్లు ఒకటి తరువాత ఒకటి పీల్చేశాడు.

జువ్వు మంటూ గాలి దుమారం ప్రారంభమయ్యింది.

తన తండ్రి , ఇక్కడ చేరిన వాళ్లంతా దాదాపుగా కుప్ప కూలిపోయినట్టేనా? ఇంకా అర్థం పర్థం లేని ప్రతిఘటన కొనసాగిస్తారా? ఏది ఏమైనా వాళ్ల పద్ధతికి కాలం చెల్లినట్టే... ఔనా? అయితే ఈ గాడుపు దుమారంలో తనెక్కడ నిలబడాలి? తండ్రి స్థానంలో నైతే కాదు. తండ్రి తరతరాలుగా రూపొందిన స్థానంలో కుప్పకూలి పోయాడు... తను తన స్థానం వెతుక్కొని స్థిరపడాలి.

గాడుపు దుమారం అంతకంతకూ పెద్దదయింది దుమ్ము, ఎండుటాకులు! మేఘాలు ఆకాశంలో గిరికీలు కొడుతున్నాయి. ●

